

గాయత్రి గోళ్లకు రంగు వేసుకుంటూ కూర్చుంది. ఆ పిల్ల గోళ్ళు కోలగా, మెరుగుపెట్టినట్టు నిగనిగ లాడుతూంటాయి. దానిపైన రంగు పూయగానే పూర్వకాలపు వళ నక్షత్రాది వర్ణనలు గుర్తువచ్చి తీరతాయి. వాళ్ల అమ్మ వసారాలోనుంచి వెళుతూ వెళుతూ, ఎత్తు అరుగుమీద వేసిఉన్న చాపను, దాని పైనున్న వాణీ అపరావతారం వీణను, గోళ్లను శృంగా రించుకుంటున్న కూతుర్ని, ఎర్రని కొంటెతనం చూపి స్తున్న నెయిల్ బ్యూటీ సీసాను ఒకమారు



ఆగి చూసి 'నీ సింగారం బంగారంకామా!' అని మనసు మురిసిపోతున్నందుకు చిహ్నంగా బుగ్గలు నొక్కు కుంటూ వెళ్లి పోయింది.

గాయత్రి మెత్తగా నవ్వుకుంది. ఆఖరి గోటికి కూడా రంగువేసి, నాలుగువేళ్లూ దగ్గరికి పెట్టి చూసుకుని బొటనవేలిని ఎదురుగా తిప్పుకుంటూ, కుడిచేతినికూడా మరోసారి చూసుకుంది. నాన్న గారికి గోళ్ళు చూపిస్తే ముద్దుపెట్టుకుంటారు తప్ప కుండా. ముందు రేపు చూస్తారే ఆ పని చేస్తారో? గాయత్రి మనసులో 'రేపు' అనే మహోజ్జ్వలమైన మలుపు మెదిలింది క్షణకాలం.

కొత్తగా మెరుస్తున్న వర్ణం ఎలా వాయిస్తాయో ఊహించుకుంటూ గోళ్ళ మాటిమాటికి చూసు కుంటూంది గాయత్రి అక్కడినుండి లేవకుండానే. శ్రీరాగంలో 'స్వామి నిన్నే కోరియున్నాను' పెదవుల మీద నృత్యం చేస్తున్నది. పదేళ్ల గాయత్రికి గోళ్లను ఎంత చూసుకున్నా తనివితీరటంలేదు. 'భూమిలో వెలయు . . . శ్రీగర్భపురి కౌమార . . .' అని అంటూ సారణిమీద సా పాలమధ్య వ్రేళ్ళు ఎలా నాట్యంచేస్తాయో గాలిలో వాయించి చూసుకుం టూండగానే నిజంగా వాయించాలనిపించింది అప్పటి కప్పుడు. తలఎత్తి ఎదురుగా ఉన్న వీణను చూసుకుంది కుతూహలంగా.

వాకిలి గుమ్మంలో నీడలా కదిలింది ఏదో. అటు తిరిగి చూసింది చప్పున. పిన్నిగారు! దేవమణి పిన్నిగారు ఎప్పటినుంచి అక్కడున్నారో ఏమో! గుమ్మానికి ఆను కొని నవ్వుతూ నిలబడ్డారు. గాయత్రి సిగ్గుపడటం చూసి దేవమణి పలకరించి, ''ఏదీ. ఒక పాట వాయించి చూపించు, గాయత్రీ. నువ్వు వాయిస్తే నే చూడలే దెప్పుడూ'' అంది.

''కూర్చోండి, పిన్నీ. అమ్మతో చెప్పి వస్తా'' అని వెళ్లబోయింది గాయత్రి. అపుతేనూ ''ఫర్వాలేదమ్మా. నువ్వు పాడు. అమ్మకి నేను కొత్తా ఏమిటి?'' అంది.

''ఇదిగో . . . ఈ సీసా ఉంచేసి వస్తా, పిన్నీ!'' అని

...సరికి పెరిగెత్తింది గాయత్రి.

లోపలికి వెళ్ళిన గాయత్రి 'పిన్నిగారు వెళ్ళిపోతే బాగుండు' ననుకుంది కొంచెం ఆలస్యంచేసి చూసింది.

ఆవిడ ముందు పాడితే కంగారులో తప్పులు ఏర్పడి ఏమో, కొత్త పాట పాడితేనే నయం! వాస్తారంటారు. ఎలిగి నలిగి ఉంటేనే పాడాలని . .

ఇక లాభంలేదు . ఆవిడ ఉందో లేదో చూడా లని పిల్లిలా నడిచి వెళ్ళింది దేవమణి మోకాళ్లమీద గడ్డాన్ని ఆన్చుకుని అర్ధనిమీలిత నేత్రాలతో వీణనే తదేకంగా చూస్తూ వీణకు దగ్గరగా ఎత్తు అరుగుమీదే కూర్చుని ఉంది.

రెండుమెట్లూ ఎక్కి మెల్లిగా వీణను చేతిలోకి తీసుకోక తప్పలేదు గాయత్రికి.

అలాగ కూర్చునే 'ఊ . ఇక ఆరంభించు' అన్నట్టు సైగచేసింది దేవమణి

వర్షం ఎత్తుకుంది గాయత్రి ఎదుట ఓ మనిషి కూర్చుందన్న స్పృహచేత వేళ్ళు తడబడుతున్నాయి. పాట సాగుతూంది గొంతుకలో జీర ఎక్కొంది కాని పాట సాగుతూంది, జీవితపు ఒడిదుడుకులతో సంబంధం లేనట్టు సాగిపోయే కాలచక్రంలా

ఆఖరి స్వరాలు ఆయాసంతో నడిపిస్తూ ంది గాయత్రి.

"స రి మా రి గ రి . . .
స రి ప ప మ రి స . . "

అంతే. అక్కడే మరిచిపోయింది తరువాయి కొంత. ఎందుకైనా పనికొస్తుందని మళ్ళీ ఆ స్వరమంతా మొదటినుంచి తిరిచి చూచింది పట్టుబడిపోక తప్పలేదు. . . కొద్దిగా ఆగిందో లేదో పిన్నిగారు "ఊఁ!" అంది

"ఉహూ! మరిచిపోయాను." గబుక్కున పెట్టెయ్యబోయింది వీణ.

"ఉంచు . ఉంచు . ." అని దేవమణి జ్ఞాపకం తెచ్చుకుంటున్నట్టు కూనిరాగం తీస్తూ ప్రయ


# ఇదుగో మీకు కొత్త కుసుమ కోమల కాంతి — కొత్త హిమాలయా బుకే స్నో




సౌందర్యానికి కొత్త సూత్రం! కొత్త హిమాలయా బుకే స్నోలో గల ప్రత్యేక పదార్థములు మీ చర్మానికి కొత్త కుసుమ కోమలాన్ని కలిగిస్తాయి.
ప్రతీ సీసా, పైపంకూ నిండుగా వుంటుంది రెండు మనోహర పరిమళములు.

కొత్త ప్యాక్: ఇప్పుడు గులాబీ పరిమళం కూడా



లింటాస్-HBS 39-138 TL

హిందుస్థాన్ లీవర్ లిమిటెడ్ వారి విశిష్టమైన ఉత్పత్తి (రిజిస్టర్డ్ యూజర్స్)

తల్లినుండి పిల్లకు పారంపర్యా వుడ్‌వార్డ్స్' వార్తే
వాడుకగా వస్తోంది

మీ శిశువును
# వుడ్‌వార్డ్స్
గ్రైప్ వాటర్‌తో
## ఆరోగ్యంగాను, ఆనందంగాను వుంచండి

తరతరాలనుంచి తెలివైన తల్లులు తమ శిశువులకు
వుడ్‌వార్డ్స్' గ్రైప్ వాటర్‌ను వాడియున్నారు. వుడ్‌వార్డ్స్' కడుపులో
కుట్టు నొప్పి, పైత్యం, వాయువు మరియు పళ్లు వచ్చునప్పటి
అబ్బురం, ఈ బాధల నుండి తక్షణ విముక్తి కలిగిస్తుంది.



సురక్షితంగా వుంచండి.
నిబ్బరంగా వుంచండి.
సర్వదా ఒక సీసాను
దగ్గరుంచుకోండి.




వుడ్‌వార్డ్స్' గ్రైప్ వాటర్
తెలివైన తల్లులు
వంద ఏళ్లకు మించి
వాడుచున్నారు.

AT. 30 TL.

దేవమణి.

అలవాటుప్రకారం అనుమంద్రం దగ్గరనించి చూపుడువేలితో ఒక్కసారి మీటి చిటికెనవ్రేలితో శ్రుతి చేయబోయింది గాయత్రి. వెంటనే 'జఙ్' మని ఒకే ఒక ధ్వని! గాయత్రి ఉలిక్కిపడింది. దేవమణి కళ్లు పెద్దవిచేసింది.

రహస్యంగా పాదాలు ఎత్తి నడుస్తున్న దేవత కాలి మువ్వలు జారిపడినట్లు తంత్రులు సందడిచేశాయి. అంత గంద్రగోళము చేసి మౌనంగా ఊరుకుంది వీణ. ఆపైన దేవమణే నిజంగా గంద్రగోళపడిపోయింది.

"నా తెలివి తెల్లవారిపోయింది! శ్రుతులు సరి చూడకుండానే నీచేతి కిచ్చా చూడు వీణను. నా చేతిలో తీగె తెగిపోయినా బాధలేదు. ఇక అంతే! కాని నీ చేతిలో తెగిపోకూడదు, తల్లీ! తెగిపోయినా నువ్వు వెంటవెంటనే కట్టుకుంటుండాలి!" వీణను గాయత్రి ఒడిలోంచి తీసి కిందపెడుతూ అన్న దేవమణి అంతర్గత గీతంలోని అప్రశుతుల్లాటి మాటల్ని అర్థంచేసుకోలేని లేత దనంతో "మాస్టారూ అదే అంటుంటారు, పిన్నీ!" అంది గాయత్రి.

దేవమణి ఆ గదిలోనే ఉన్న చిన్న అల్మైరా తెరిచి, ఒక ప్లాస్టిక్ భరిణ తీసింది.

వీణ బిరడాకు కొత్త తీగె బిగిస్తూ "శ్రుతులు సరిచేసే జ్ఞానమే ముఖ్యం, గాత్రీ! అందులో వాదన మొక్కటే ఆధారమైతే మరీను! ఒకవేళ నీకు ఒక పట్టాన అంతుపట్టనట్టయితే ఎండవేళ స్కూలుకి వెళ్లేటప్పుడు ఒక అరగంట ముందుగా ఇక్కడికి వస్తూండు అప్పుడప్పుడు. అలాటప్పుడు బాబాయి గారు ఇంట్లో ఉండరు కనుక నీ కిక్కడ ఆయా మెళకువలు చెబుతాను" అంది. గాయత్రి తల ఊపింది.

అనక 'మందరధారీ, మోక్షమురారీ' అనే పాట పాడి దేవమణి హృదయంలో మధువు నింపింది గాయత్రి.

"మీరు ఓ పాట పాడండి, పిన్నీ!" అనాలనుకుని, అంత సాహసంలేక, ఆవిడవైపు అర్థవంతంగా చూస్తూ కూర్చుంది గాయత్రి. ఆమె అంతకంటె అనురాగంతో వీణను చూస్తున్నది. గాయత్రిని మరిచిపోయింది ఆ సమయంలో దేవమణి. ఇక ఆపలేక వీణను తీసుకుని రాగాలాపన చేయ నారంభించింది. హృదయాన్ని రోమాంచిత భక్తితో నింపివేసే ముఖారిలోని 'ఏంతని నే వర్ణింతును' అని శబరీ భాగ్యాన్ని స్మరించే మధుర కృతి అది.

'కనులార సేవించి కమ్మని ఫలముల నొసగి' అంటూ నాదోపాసన చేసేవేళకు వీధి తలుపుమీద పిడుగులు రాలినట్టు చప్పుడయింది. దానితోపాటు "అమ్మగారూ! బాబుగారు పిలుస్తున్నారు" అంటూ పనిదాని కేక.

"చూచావా గాత్రీ! నేను వీణ ముట్టుకోవడమే తప్పు. నాకు తెలుసు" అంటూ ఆ పాటను అక్కడికి తుంచేసి, తొందరగా వీణను పెట్టెదగ్గరకి తీసుకు వెళ్లింది దేవమణి. గాయత్రికూడా కంగారుగా లేచి నిలబడింది. అప్రయత్నంగా వీణ ఉంచుతున్న పెట్టె లోకి చూస్తూ విస్మితురాలైంది ఆ పిల్ల. ఆ పెట్టెలో ఎన్నో పువ్వులు! ఎండిపోయినవీ, వాడినవీ, వాడుతున్నవీ, వాడబోయేవీ, అప్పుడే విరిసినట్టున్నవీను! బంతి,

చేసుంతి, [illegible]! [illegible] అనిపించింది గాయత్రికి.

"ఏ జన్మలో నా చిరుబ్బురు, అహంకారం మితిమీరి అతిగా తయారైనాయో, ఈ జన్మలో నచ్చిన విద్యపట్ల అమిత దుఃఖాన్ని అనుభవిస్తున్నాను మరో జన్మలో ఇలాంటి లోటు ఉండకుండా చేసుకోవాలనే నా యీ పూజలూ, నా తపస్సూ" అంది ఆవిడ. పీఠంమీద చెక్కిఉన్న సరస్వతి విగ్రహమున్న [illegible] బొట్టు చూస్తూ మూగగా నిలబడింది గాయత్రి.

దేవమణి గానాభిలాషను పూర్తి [illegible] గాయత్రి సంగీతంలోకి మెల్లగా వర్ధిల్లుతూంది. స్వర స్పష్టంగా [illegible] ఉచ్ఛ్వాసం ఎక్కువవడాను. అంత సాధనగా [illegible] గాయత్రి ఆకారం ఎప్పుడూ గండోలికల్లో, స్వరతరంగాల్లో ఓలలాడుతున్నట్లుంటుంది.

పెళ్ళికాక ముందే సుమారు ఏది పన్నెండుసార్లు రేడియోలో ప్రోగ్రామ్ ఇచ్చింది. మొదటిసారి ఆకాశవాణి నిలయవిద్వాంసుడు పరీక్ష చేశాడు గాయత్రిని. గాయత్రి సంగీత కళాశాలలో నేర్చుకున్న దానిలు కాదు. చదువు దారి చదువుదీ, సంగీతం దారి సంగీతానిదీ అయింది. ఆకాశవాణి పరీక్షలో మొదటిసారి నెగ్గలేక పోయింది. దానితో గాయత్రి గుండె ముక్కలైపోయింది. నిప్పులా రాజుకుంది. ఆ నిప్పులో పడి, ఇదివరకు ఆమె కృషికి అడ్డువస్తూ ఉండిన అశ్రద్ధ అనే దుష్టకీటకం నుగ్గునుసి అయింది. అవిరామ సాధనవల్ల గాత్రానికి ఒక అపూర్వత్వం వచ్చింది. రెండో సారి పరీక్షకు నిలిచినప్పుడు గాయత్రి గొంతుకలో వచ్చిన మార్పుని, గాంభీర్యాన్ని పరిశీలించి రేడియో విద్వాంసులు ఆశ్చర్యపడ్డారు. అప్పటినుంచి గాయత్రి రేడియోలో పాడుతూనే ఉంది. మొదటిసారి గాయత్రి రేడియోలో పాడినప్పుడు, రహస్యంగా వాళ్ళింటికి వచ్చి విన్న దేవమణి కళ్ళు తెలియని ఆనందంతోనూ, అర్థం కాని బాధతోనూ ఆర్ద్రాలయ్యాయి.

గాయత్రికి అనిపించింది: "ఈమాత్రపు తననే కొందరు పెద్దగా పొగుడుతున్నారు. దేవమణిలాంటి నిజమైన విద్వాంసురాలి గానం వింటే మూర్ఛపోరూ వీళ్ళు? దేశంలో ఒక సుధామధుర గాయనిని వినలేక పోతున్న దురదృష్టవంతులు దాముని ఎలా తెలుసుకుంటారు వీళ్ళు? ఎలా చెప్పడం?'

పెద్దవుతున్నకొద్దీ, — ముఖ్యంగా సంగీతంలో పెద్ద అవుతున్నకొద్దీ — దేవమణి పిరికితనాన్నీ, అమాయకత్వాన్నీ హర్షించలేకపోయింది గాయత్రి.

గొంతులోని బెరుకుదనం బాగా వదిలిపోతున్న రోజులు. స్వేచ్ఛాగానంకోసం గళం సంపూర్ణంగా విచ్చుకుంటున్న సమయం. ఆ రోజుల్లోనే తల్లిదండ్రులు గాయత్రిని మరొకరి చేతుల్లో పెట్టి, బాధ్యత తీరిన తృప్తిని అనుభవించారు.

* * *

దేవమణిని గురించి ఆ లేతవయసులో అనుకున్న వన్నీ ఇప్పుడు గుర్తుకు వస్తున్నాయి గాయత్రికి. నిజమే, కళ తపస్సే. కాని, పూర్వ మెలా ఉండేదో కాని, భవబంధాల్ని వదిలించుకుని ఏ మనిషీ ఇలాంటి తపస్సుకోసం పరిగెతు తాడు? అధవా పరుగులెత్తినా పాడులోకం హర్షించదు. దేవమణి నిలబడినచోటే నిలుచుండిపోయి చేతకానిది అయిందంటే అర్థం ఏం! నా ఉంట [illegible] ఆడది [illegible] నిడి ఫిరాయిపడుగ్ని చిన్ననాటినుంచి నూరిపోస్తారు. లోక రీతి మారితే బాగుండును.

గాయత్రికి ఒకరోజు ఆహ్వానం వచ్చింది. దాని సారాంశం ఏమిటంటే — ఆమె ఒక ఊళ్ళో జరుగుతున్న 'త్యాగరాజ సంగీతోత్సవాల' సందర్భంలో కచ్చేరి చెయ్యాలట. గాయత్రి పెళ్ళికాకముందు ఇలా సంగీత కచ్చేరీలు చెయ్యకపోలేదు. ఒకసారి హైద్రాబాద్‌లోనూ, మరోసారి స్వంత ఊళ్ళోనూ కచేరీ చేసి శ్రోతల మన్నన అందుకుంది. ఖరగపూర్‌లాంటి రాష్ట్రేతర ప్రాంతాలనుంచికూడా పిలుపులు వచ్చేవి. ఇప్పుడు ఒరిస్సా ఆంధ్రులనుంచి ఆహ్వానం వచ్చింది. ఆ సమితి అధ్యక్షుడు పేరెన్నికగన్న లాయరు.

గాయత్రి శ్రోతల సమక్షంలో పాడి చాలా రోజులైనందువల్ల ఉత్సాహపడింది. కాని తన భర్త ఎప్పుడూ లేనిది గంభీరంగా మారిపోయి అటంక ఎరచగంతో ఎక్కడలేని నీరసం ఆమెని ఆవహించుకుంది.

రెండు సార్లు ఎరిగ్గా ఇలాగే జరగడంతో గాయత్రికి చిన్ననాడు దాని సంగీతాన్ని అష్టకష్టాలకోర్చి సాధన చెయ్యడమూ, కొంచెం పెద్దయ్యాక దేవమణినిగురించి ఎన్నో ఆలోచించటమూ అన్నీ గుర్తువచ్చాయి. దేవమణిని చేతకాని మనిషి అంది. ఇప్పుడు తనేం చెయ్యగలిగింది కనక?

ఇంకోమాటు చాలా నిక్కచ్చిగా చెప్పాడు గాయత్రి భర్త మూర్తి. "నువ్వు రేడియోలో పాడితే అభ్యంతరం లేదు. సభల్లో పాడటం నా కిష్టంలేదు."

మౌనం కొన్ని విషయాల్లో అర్ధాంగీకారంగా అర్థమౌతుందేమోకాని కొన్ని సమయాల్లో విప్లవారంభానికి సూచన. తిరుగుబాటుకు నాంది.

గాయత్రి మనసులో అనేక ఆలోచనలు ఒకదానితో ఒకటి పెనుగులాడాయి; పోట్లాడుకున్నాయి; చంపుకున్నాయి; బ్రతికాయి. పర్యవసానంగా గాయత్రి మనసు జాగరణలో సుప్తిలాగ ఉలికులికి పడటం మొదలుపెట్టింది తనది యథార్థ జీవితం, యథార్థ జీవితంకాదేమోననిపించింది. 'కళ అంతా నీట కలిసిపోవలసిందేనా ఇంక?' అని కుంగిపోయింది.

ఔను! — ఇప్పు డింతటితో సరిపెట్టారు. రేపు రేడియోలోకూడా పాడనివ్వరు.

ఆఖరికి అనేసుకుంది బెరుకుగానే! 'సంగీతమే తన జీవితం. ప్రాణంలేనిమనిషి నడుస్తూ ఎలాగి? భగవంతుడా, ఎంత పని చేస్తున్నావు? ఇంతకన్న నన్ను . . . నన్ను... చంపేస్తే ఎంత హాయి!'

"నేను పెళ్ళికాకముందుకూడా ఎన్నో చోట్ల కచేరీలు చేశాను. నాకు అనుభవం లేదని మీరనుకుంటున్నారు కదూ?" అంది గాయత్రి ప్రాధేయత అంతా కంఠంలోనించి గుప్పిస్తూ.

"అప్పటి మాట వేరు . . . ఇప్పుడు నా కిష్టం లేదు . . ."

"సంగీతం లేకుండా నేను బ్రతకలేను."

"నిన్ను మానమన్నా దెవడు? ఇంట్లో పాడుకో. అంతగా కావాలంటే రేడియోలో పాడు" అన్నాడు మగతనం ఆధారంగా మూర్తి.

గాయత్రి కళ్ళు అప్పటికే చెమ్మగిల్లిఉన్నాయి.

"[illegible] సరదా తీరుతుందా?" అంది [illegible]

"ఇలాంటి [illegible] పాడటం రంగసానుల పని. భక్తి పాటలు కనక గృహిణులూ పాడుకోవచ్చు అన్నారు పెద్దలు" అన్నాడు మూర్తి.

గాయత్రి ఒళ్ళు జలదరించింది. "అంటే, దేశంలో పాటకచ్చేరీలు చేసే విద్వాంసురాళ్ళంతా రంగసానులేనా మీ ఉద్దేశంలో? ఇన్నాళ్ళూ పాడినందుకు నేనూ అంతేనన్నమాట! నా దగ్గిర అన్నారు, సరిపోయింది. ఇంకోచోట అనకండి ఎక్కడా. అవమానంపాలౌతారు."

"షటప్!" అన్నాడు మూర్తి కోపంతో. "సంగీతాన్ని వదులుకోలేనంటే నాకన్నా అదే ఎక్కువన్న మాట నీకు! అయితే నన్ను వదిలి పో, తెగించిన ఆడదానిని అడ్డేవాడెవడు?" అన్నాడు.

కన్నీళ్ళు నిగ్రహించుకోలేక రెండుచేతులతోను కప్పుకుంది మొహాన్ని.

ఎన్నాళ్ళయినా గాయత్రికి దుఃఖం క్షణమాత్రం



అల్లదిగో

ఫోటో — ఎమ్. వి. సలోఖే (కొల్హాపూర్)

తగ్గలేదు. మనసు మారనూలేదు.

అతన్ని మళ్ళీ బ్రతిమాలుకుంది. అతను అంతకన్నా మారలేదు.

* * *

ఎంత తేలిగ్గా "పో" అనేశాడు. ఈ మాట ఆడది అనగలదా? భగవాన్! నువ్వుకూడా పొరపాట్లు పడుతుంటావేమో అని అనుమానంగా ఉంది. అన్నిటిలోను ఆధిక్యం ఇచ్చి, ఆడదానిగా పుట్టించావు. ఆడదంటే లోకానికున్న అలుసు నీకు తెలీనిదా? — చెప్ప శక్యం గానన్ని ఆలోచనలతో ఉక్కిరిబిక్కిరయింది గాయత్రి.

పర్యవసానం —

సంగీత రాగోదయంలా ఉన్న ఓ ఉదయాన ఇంటిముందు టాక్సీలోంచి దిగుతున్న కూతుర్ని చూసుకుని తల్లిదండ్రులిద్దరూ వింతపడ్డారు. కారణం తెలుసుకున్న తరవాత తల్లీ, తండ్రీ ఇద్దరూ కోప పడ్డారు. తండ్రికి ఈ ఆలోచన అంతరాన పీడిస్తున్నా, కూతుర్ని ఏమనలేక లోకంవైపు చూడటానికి




## స్ట్రెప్సిల్స్ మాత్రమే వాటిని కలిగించే క్రిములను చంపుతుంది — అతి వేగంగా

కారణమేమిటంటే, స్ట్రెప్సిల్సులో మాత్రమే రెండు బలమైన క్రిమినిరోధక మందులు ఉన్నాయి—ఒకటి, 2:4 డైక్లోరో బెన్‌జెల్ ఆల్కహాల్; రెండు, అమిల్-మిటా-క్రెసోల్ ఈ రెండింటిలో గొంతుక నొప్పిని కలిగించు క్రిములను తప్పక చంపునని ఋజువయిన శక్తి ఉంది. ఇంతకుముందు మీరు వాడినవేవియు ఈయనంత త్వరగా మీకు నివారణ నివ్వదు. వైద్యశాస్త్రీయంగా ఋజువు చేయబడిన స్ట్రెప్సిల్సు దగ్గర ఉంచుకోండి. అవి పిల్లలకు కూడా మంచివి.



**స్ట్రెప్సిల్స్**
క్రిమినిరోధక గొంతు బిళ్ళలు

*గొంతుకనొప్పి, దగ్గులకు అతివేగంగా పనిచేయునని వైద్యశాస్త్రీయంగా ఋజువు చేయబడినవి*

స్ట్రెప్సిల్సు చప్పరించండి
గొంతునొప్పి మొదలవ్వగానే:
గొంతులో గరగర,
కష్టముగా మ్రింగుట,
గొంతురాపు, దగ్గు,
పొగత్రాగు వారి
గొంతురాపు మొ॥వి.

A BOOTS RESEARCH PRODUCT

CMBS-IA TL

బెదురుతూ కూర్చున్నారు. కాని, తల్లి? — తనదనే ఆలోచన ఒకటి ఉంటుందనే ఊహకూడా లేకుండా మొదటినుంచి సమాజాభిప్రాయాలకి కట్టుబడిపోయిన తల్లి ఊరుకోలేదు. స్త్రీగా బలహీనురాలు. మనో దార్ఢ్యం బహుకొద్ది.

"నీకన్నా దేవమణి ఎన్ని రెట్లు గొప్పదే! అంత విద్వాంసురాలు రాత్రింబవళ్ళు ఏడుస్తూకూడా విద్య వదులుకొని తలిదండ్రుల పరువు నిలిపింది" అని రోజూ అంటూనే ఉంది తల్లి.

"ఇప్పటికైనా మించిపోయింది లేదు" అని హెచ్చరించారు తల్లీ, తండ్రీను. శూన్యంలోకి చూడటం మాత్రం చేసింది గాయత్రి.

వార్తలూ ఆగవు, కాలమూ ఆగదు.

ఈ వార్త విచిత్రవార్తగా మారి బంధువర్గం దాకా వెళ్ళింది. వాళ్ళు గాయత్రి తండ్రిమీదికి ఉత్తరాల్ని గుప్పించారు. అందులో కొన్ని ఆకాశరామన్న జాబుల తీరులో వచ్చాయి.

గాయత్రి తండ్రి గోవిందాచారి చాలా కుంగి పోయారు.

"నీ పిల్ల మన వంశంలో కనీ వినీ ఎరగని పనికి నాందీప్రస్తావన చేసింది. మొత్తం బంధువర్గానికే అప్రతిష్ఠ తీసుకువచ్చింది. పిల్లలు చేసే మంచికైనా, చెడ్డకైనా మూలస్తంభాల్లాంటి తల్లితండ్రులే కారకులు. ఇప్పటికైనా మించిపోయింది లేదు.

—నీ శ్రేయోభిలాషులు."

అది చదివి గాయత్రి ఎంతకూ మాట్లాడక పోయేసరికి, "నువ్వు రాయివే, అమ్మా!" అని తల్లి మొహంముదే అని కళ్ళు ఒత్తుకుంది.

'నా కీర్తిప్రతిష్ఠలు తమ చెవికి రానట్టే ప్రవర్తించిన బంధువులకి నా అపకీర్తి అప్రతిష్ఠ గాపట్ల ఎంత శ్రద్ధ కలిగింది.' అనుకుంటున్నది గాయత్రి.

కాలమాన పరిస్థితులనుబట్టి ఆ కుటుంబాన్ని ఎవరూ వెలివేయలేకపోయారు. కాని వెలివేసినట్టే చూపులద్వారా తెలిసేది. గాయత్రికీ తనమట్టుకు తనకి అలా అనిపించేది. తల్లితండ్రుల మనసుల్లో అశాంతి తుపానే అయింది. మామూలు తుపాను కాదిది. ఈ మానసికమైన అవస్థకి తిరుగుముఖం అన్నది లేకుండా పోయింది. గాయత్రికి శూన్యంలో దైవాన్ని చూడటం బాగా అలవాటయిపోయింది.

* * *

మూర్తి సులువుగా విడాకు లిచ్చాడు. ఉన్న ఆశ చెరిగిపోయింది గోవిందాచారిగారికి. గొప్పతనమనేది చాలా రోజులు దాగి ఉండదు; ఉండలేదు. ముఖ్యంగా ఉండనివ్వదు లోకం. ఒక వ్యక్తి గొప్పతనం ఎవరికీ అక్కర్లేనట్టున్నా, అందరికీ కావాలి.

అందుకే మళ్ళీ ఒకచోటునుంచి గాయత్రి ఆహ్వానించబడింది.

తండ్రి మౌనం చూచి, "నాన్నగారూ! నేను దేని కోసమైతే అన్నీ వదులుకుని ఇంతమనిందను సోగించి వచ్చేశానో అందుకు కాకపోతే, ఇక నాకు ఆత్మ హత్యే శరణ్యం" అంది గాయత్రి.

ఆమె కళ్ళల్లో బాగా మబ్బులు కమ్ముకునిఉన్నాయి. కాని వర్షం కురిసే అవకాశం లేకుండా తండ్రి అంగీకారం పెనుగాలిలా మబ్బుల్ని తరిమేసింది. ఒకటే

రెండు చినుకులు కురిసినా, అవి ఆనందపు జల్లులయ్యాయి.

• • •

స్టేషన్లో గాయత్రికి స్వాగతం చెప్పటానికి పెద్దవాళ్ళే వచ్చారు.

కార్లో వెళుతూ గోవిందాచారిగారు కొంతలో కొంత ఆనందించారు కూతురికి జరుగుతున్న గౌరవం చూచి. కాని వెన్వెంటనే వెలితిలా ఉంది మనసు.

గాయత్రి ఉండటానికి అవ్వస సభాధ్యక్షుని ఇంట్లో ఏర్పాటుచేశారు.

రాత్రి తొమ్మిది గంటలకు కచేరీ ఆరంభమౌతుందనగా సాయంత్రం అయిదు గంటలకే మహిళా మండలివాళ్ళు గాయత్రిని ప్రత్యేకంగా సన్మానించటానికి గాను తీసుకువెళ్ళారు.

గోవిందాచారిగారు వాలుకుర్చీలో పడుకుని గదిలో వాసాలు ఏకాగ్రంగా చూస్తున్నారు. 'ఏడుగంటలయింది. గాయత్రి వచ్చేస్తుంటుంది.' అలా ఉన్న ఆయన ఆ భవనం అవతలి ఇంటినుంచి గాలిలో తేలి వస్తున్న సంభాషణ అప్రయత్నంగా వినసాగారు.

"ఈ రాత్రిపూట వెళ్ళకపోతే ఏమైంది?" అంటూంది ఆడగొంతు.

అతనెవరో అంటున్నాడు చాలా గట్టిగా. "సంగీతం మనం కావాలనుకుంటే వచ్చేదే అనుకున్నావ?"—

"రేడియో ఉన్నాయిగా!"

"సంగీతం ఎక్కడ దొరికినా పరిగెత్తాలే, పిచ్చి పిల్లా!"

"మీరు గడిగడికీ ఇలా . . ." ఆపైన వినిపించలేదు. వీధిలో రణగొణ ధ్వనులు. కారు శబ్దం.

ఏడున్నరనించి టౌనుహాల్లోకి సంగీతప్రియులూ, సంగీతాభిమానులూ వెంచేస్తూనే ఉన్నారు. గాయత్రి కీర్తి ఎలా ఎక్కువైందో అలాగే శ్రోతలూ ఎక్కువయ్యారు.

మొదటి వరస కుర్చీల్లో గోవిందాచారిగారిని కూర్చోమని ప్రార్థించారు అక్కడి నిర్వాహకులు.

గోవిందాచారిగారు కూర్చున్న ఒక నిమిషానికి, అంతకు ముందు స్టేషన్‌కు వచ్చిన పెద్దమనిషి ఒకాయన వచ్చి పక్కనే కూర్చున్నాడు. క్రమక్రమంగా ఎనిమిదిన్నరకంతా హాల్లో చాలా భాగం నిండింది.

పక్కనున్న పెద్దమనిషి ఆచారిగారిని పలకరించాడు. "ఇంటిపేరునుబట్టి తెలుస్తూంది. మీరు మా వంశీయులే."

గోవిందాచారిగారు నవ్వి ఊరుకున్నారు.

"అమ్మాయికి పెళ్ళి అయింది కదండీ?"

ఒక్కసారిగా వచ్చిపడ్డ ఉప్పెనను తమాయించుకుంటూ "అయింది" అన్నారు. తేలిపోయింది మాట.

అతడే మళ్ళీ అన్నాడు. "అమ్మాయి పేరు తెచ్చుకున్నందుకు మన జాతివాళ్ళమంతా ఎంతో గర్వించాలండీ!"

ఇదంతా ప్రాణాంతకంగా ఉంది గోవిందాచారిగారికి. తెచ్చికోలు నవ్వే శరణ్యమైంది.

నిశ్శబ్దం ఆవరించింది. గాయకి అయిన గాయత్రి స్టేజిమీద నిండుగా, హుందాగా కనిపిస్తూంది.

సదస్యులకు నమస్కరించి కూర్చుంది. కంఠం పెరించి సరస్వతీదేవిని స్తుతించింది.

ధ్వనుల ప్రతిధ్వానంతో నిండిఉంది. చుట్టూ చప్పట్లు మారుమోగుతున్నాయి. ఒక విధమైన నిర్లక్ష్యం

గాయత్రి ఒక సంపూర్ణ రాగాన్ని ఆలాపనచేస్తున్న సమయంలో గోవిందాచారిగారు తన చుట్టూ పరికించారు. హాలంతా నిండిఉంది. కొందరివేళ్ళు అప్పుడే లయ వేస్తున్నాయి.

గోవిందాచారిగారికి ఆ గానం కొత్తకాదు. ప్రతిరోజూ ఇంట్లో విధిగా వింటున్నదే. అందుచేత ఇంతమందిలో ఆయన మనసు ఒక్కనిమిషమైనా నిలవడంలేదు. ఎంత నిశ్శబ్దంగాఉన్నా, సభికులెంత ప్రశాంతంగా ఉన్నా అక్కడక్కడా గుసగుసలు వినపడకపోలేదు. కొందరు గాయత్రి గాత్ర మాధుర్యానికి మగ్నులైపోయారు.

హఠాత్తుగా వెనకనుంచి వినవచ్చిన సంభాషణ గోవిందాచారిగారి చెవుల్ని సోకింది.

"ఈ అమ్మాయి ఎవరి తాలూకు?"

ఫలానా అని చెప్పాడు మరొకాయన.

"ఓ — అలాగా. వాళ్ళు నాకు తెలుసే! నా తోడల్లుడికి బాగా స్నేహితులు. విజయనగరం అంటే జ్ఞాపకంవచ్చింది."

"అయితే ఈ అమ్మాయి భర్తది ఏ ఊరు?"

"ఏమో? అదంతా మనకు తెలియదు. కాని ఈ అమ్మాయిని సంగీతకచేరీలు చేయవద్దని అతడు ఆంక్ష విధించినట్టు చెప్పుకుంటారు. అంక్షల్లోనూ, హద్దుల్లోను ఏ కళ వృద్ధిచెందుతుంది, చెప్పండి!

> **ప్రతిభ**
>
> ప్రతిభావంతు డెంతటి మహత్తర కార్యమయినా సాధించగల డని అంటారు. కాని అతగాడు తన బ్రతుకుతెరువుమాత్రం చూసుకోలేడు!
>
> —జాన్సన్

ఈ అమ్మాయి భర్తతో పోట్లాడి వచ్చేసిందట. మంచిపని చేసిందిలెండి. లేకపోతే ఏమిటా కుత్సితం బుద్ధి, మనలాంటి సంగీతప్రియుల మనసులో మట్టికొట్టేందుకు కాకపోతే? . . ." చివర్న కొద్దిగా నవ్వు.

గోవిందాచారిగారి మనస్సు చివుక్కుమంది.

ఇంకా అవతలవాళ్ళిలా అనుకుంటూనేఉన్నారు. "చూడండి, ఆ గొంతుకలో ఎంత మాధుర్యం ఒలుకుతున్నదో? ఇదంతా పూర్వజన్మ తపస్సు అంటారు. పుట్టేది ఎలాగూ గిట్టేటందుకే అని పెద్దలు ఉవాచ. ఆ ఉన్న నాలుగు గడియలూ సార్థకపరుచుకోవాలా వద్దా? సార్థకపరుచుకునే సావకాశమన్నా ఎందరికి ఉంటుంది కనక? నన్నడిగితే విద్యను దాచుకోడం, చేతకానితనానికి బలిచెయ్యడంకూడా మహాపరాధం అంటాను."

కానీ ఈ మాటలు గోవిందాచారిగారి పక్కన కూర్చున్నాయనకి భరించ శక్యంగానివయ్యాయనుకోవచ్చును. తటాల్న లేచి చరచరా అవతలికి వెళ్ళిపోయాడు. ఆ వెళ్ళిపోవడంలోనూ గొప్ప జోరు చూపించాడు.

గోవిందాచారిగారి గుండె అరక్షణం ఆగి తరవాత శ్రుతి సరిచేసుకుంటున్నట్టు దడదడ కొట్టుకుంది.

ఆయనకి మెలకువ వచ్చేటప్పటికి హాలంతా కరతాళ ధ్వనులతో మారుమోగుతోంది. సరిగ్గా అప్పుడే జరిగింది ఆచారిగారికి. మరొక విధమైన మత్తు ఆవరించుకుంటూంది.

'నీవే నా నిజమని తలచి . . .' అంటూ మైసూర్ వాసుదేవాచారి కృతిపాడుతున్న కుమార్తెను చూస్తూంటే గోవిందాచారిగారి మనస్సు ఆనందోద్రేకానికీ, కరుణాన్విత వేదనకీ నిలయం అయింది.

మళ్ళీ కొందరి కొందరి మధ్య గుసగుసలు చెలరేగాయి. గాయత్రి జీవితవృత్తాంతం అందరికీ జ్ఞాపకంవచ్చింది. వారిలో చెలరేగిన సంక్షోభాన్ని గోవిందాచారిగారు గమనిస్తున్నారు. వాళ్ళ మాటలు వద్దన్నా వినిపిస్తున్నాయి మెల్లిగా.

కొందరు తటాలున వెళ్ళిపోయారు. కొందరు గోవిందాచారిగారి వంక కోరచూపులు చూస్తూ, పెదవులు కరుచుకుంటూ వెళుతున్నారు.

గోవిందాచారిగారి మనస్సు అధోలోకానికి దిగజారింది. అంధకార కూపంలోకి జారింది మళ్ళీ. గాన రసాబ్ధిలో తేలుతున్నట్టుంది శ్రోతలకు. నవరస మాధురీ తరంగాలపై ఊగులాడే నావలయ్యాయి రసజ్ఞుల మనసులు. మౌనంగా, మానసిక వ్యథతో సభను పరికిస్తున్న గోవిందాచారిగారు ఒక దృశ్యం చూసి అటు దృష్టి నిలిపారు.

ఏభైఏళ్ళ వ్యక్తి అతను. సతీసమేతంగా కూర్చున్నాడక్కడ. అతను పూర్తిగా పరవశించిపోయినట్టు ముఖాన్ని చూస్తే తెలియవస్తున్నది. అతను రెండు చేతులూ కలిపి ఏమిటో చేస్తుంటే, అదేమిటా అని పరిశీలనగా చూచారు గోవిందాచారిగారు. చేతనున్న వజ్రపు ఉంగరాన్ని తీస్తున్నా డాయన. చకితులయ్యారు అది చూచి. ఉంగరాన్ని తీసి అరచేతిలో పెట్టుకున్నాడు. వెనువెంటనే మరో సంఘటనకూడా జరిగి గోవిందాచారిగారిని విభ్రమంలో ముంచింది. పక్కనున్న మరో వ్యక్తి — అతని ఆత్మీయుడేమో — ఆ ఉంగరాన్ని చేతిలో నించి తీసేసి, కొన్ని రూపాయలనోట్లు పెట్టాడు దాని స్థానంలో. నిష్కల్మష కళారాధనకుకూడా ఇన్ని అవరోధాలా? అని మొదటిసారిగా యోచనచేసి, భౌతికమైన విలువను అసహ్యించుకున్నారు గోవిందాచారిగారు.

ఇంతలో పడుగళ్ళలా మోగాయి చప్పట్లు. ఆలోచనలో మునిగిఉన్న ఆచారిగారు ఉలిక్కిపడ్డారు. అంధకార కంధరలో హఠాత్తుగా చంద్రోదయమైనట్లనిపించింది. మధుర భావన చల్లదనంలా ఆవరించుకుంది.

నూటపదార్లతో, పొగడ్తలతో గౌరవిస్తున్నారు స్టేజిమీద ఎవరో.

గోవిందాచారిగారి మనసు ధైర్యంతో నిండి, పులకరించింది. 'నా తల్లి కళకోసం పుట్టింది' అనుకున్నారు.

'కళాజీవులకోసం కళాదేవత కలకాలం నిలిచిఉన్నట్టు, నా గాయత్రి కళారాధకులకోసం నిలిచిఉంటుంది. కళను తృణీకరించేవారితో దానికేం పని?

దానికి కావలసింది సామాన్యమైన బ్రతుకుకాదు, అసామాన్యమైన కళారాధన. బంధువుల అభిమానాలు కాదు, కళలో సంభవమయ్యే దైవకృప.' గోవిందాచారిగారి మనసు నిండుగా అనుకుంది.

'కళకోసం ఒక్కక్షణం నిలబడే మనిషికోసమే నా గాయత్రి. వెళ్ళిపోయేవాళ్ళకోసం కాదు. కళామతల్లి అంతే!' ★